క్లుప్తంగా

మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు



మాగనూర్: మరమ్మతులకు నోచుకోక చేతిపంపులు గ్రామాల్లో కనుమరుగవుతున్నాయి. ఏ లక్ష్యంతో బోర్లనుఏర్పాటు చేశారో దానిని అధికారులు పూర్తిగా విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని అడవి సత్యారంలో వాగుసమీపంలో ఉన్న చేతి పంపు చెడిపోయి చాలా కాలమైంది. గతంలో స్థానికులకు తాగునీరు, అవసరాలను తీర్చిన చేతిపంపులు నేడు మరమ్మతులకు నోచుకోవడం లేదు. గ్రామంలో నీరు రాని సమయంలో చేతి పంపు ఎంతో ఉపయోగపడేవి. సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపుల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ధన్వాడ/మరికల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరుగ్యారెంటీలు పక్కాగా అమలు జరుగు తుందని కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. ప్రజలు ఈసారి తనను ఆశీర్వదించాలని కోరారు. అలాగేమరికల్‌లో గురువారం ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. అనంతరం ఆయాగ్రామాల నుంచి 150మంది ఇతరపార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్ వస్తేనే న్యాయం

మక్తల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్‌లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. మక్తల్ నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడిని ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

కోస్గి/దన్వాడ/మద్దూరు: కోస్గి పట్టణానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, ప్రస్తుత కౌన్సిలర్ అనిత భర్త రాస్నం బాల్‌రాజ్ గురువారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే మండలంలోని గోటూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గౌని నాగేశ్వర్‌రెడ్డితోపాటు మండల వైస్‌ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, గోటూర్ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, కొండాపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అలాగే మద్దూర్ నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు, మండల బీఆర్‌ఎస్ నాయకులు వీరేష్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరలేదు..

నారాయణపేట రూరల్: పట్టణంలోని భజరంగ్‌దళ్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారంటు సోసల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి, బజరంగ్‌దళ్ కన్వీనర్ శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలి

కోస్గి: అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను ఓటుబ్యాంకుగా వాడుకుని లబ్ధిపొందాయని, బీఆర్‌ఎస్ మాత్రమే ముదిరాజ్‌ల అభివృద్ధికి తోడ్పాటు అందించిందని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ముదిరాజ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మాగనూర్: మండలంలోని నేరడగంలో గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు.

ఎమ్మెల్యే పట్నం సమక్షంలో..


మద్దూరు: మండల కేంద్రానికి చెందిన యువకులు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో గురువారం కొడంగల్‌లో చేరారు. వారిని కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మరోసారి అవకాశం కల్పించండి

కోస్గి: నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలతో పనులు చేశామని, రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాదం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని అయ్యప్పకొండలో గల అయ్యప్ప దేవాలయంలో గురువారం అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సమాజం సభ్యులు భగవంతురావు, ముత్యం స్వామి, పంబరాజు, చంద్రశేఖర్ యాదవ్, ప్రేంసాయికుమార్, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, ప్రమోద్ పాల్గొన్నారు.



పాఠశాలలకు ప్రహరీలేవీ?

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న బడులు
- ఇష్టానుసారంగా పశువుల సంచారం
- ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాఠశాలలో ప్రహరీ లేక ఎండుతున్న మొక్కలు

మాగనూర్: మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన ప్రహరీలు కరువయ్యాయి. దీంతో రాత్రిళ్లు మందుబాబులు పాఠశాలలను అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండలంలోని మొత్తం 24పాఠశాలలు ఉన్నాయి. అందులో 11కు పైగా పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలలో పడిపోయిన సగం గోడలు, మరికొన్నిచోట్ల కొంత మేరకు ఒకభాగంలో నిర్మాణాలు చేపట్టి మిగిలిన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ పాఠశాలల ముందే దుర్భరపరిస్థితులు నెలకొంటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో గేదేలు, పందులు పాఠశాలలోకి ప్రవేశించి అపరిశుభ్రత వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

విషపురుగులు, కీటకాల సంచారం..

మండలంలోని చాలా పాఠశాలలు గ్రామానికి చివరన ఉన్నాయి. దీంతో పాఠశాలలకు ప్రహరీ లేక విషపురుగులు, కీటకాలు సంచరిస్తున్నాయి. కరోనా కారణంగా ప్రైవేట్ పాఠశాలలు పూర్తిగా మూతపడిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలకు పూ ర్వవైభవం వచ్చింది. దీంతో గతంలో ఎన్న డూ లేనివిధంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. రక్షణ లేకపోవడంతో తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి..



పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో ఉదయం పాఠశాలకు రాగానే మందుబాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మధ్యాహ్నబోజన సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. సరైన ఆటస్థలాలు కరువయ్యాయి. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలి.

– సుమన్, బీజేవైఎం నాయకులు, మాగనూర్

ఇబ్బందులు పడుతున్నాం..



పాఠశాలలో ప్రహరీలు లేక చాలా ఇబ్బందులకు గురువుతున్నాం. ముఖ్యంగా విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పందులు వచ్చి పేట్లలో భోజనాన్ని విద్యార్థుల నుంచి లాక్కుంటున్నాయి. మొక్కలు నాటిన రక్షించుకోడానికి వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి నిర్మాణాలు చేపట్టాలి.

– ప్రశాంత్, హెచ్ఎం వర్కూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు, వాటికి కావాల్సిన మౌలిక వసతుల వివరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే త్వరలోనే సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తాం.

– వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ, మాగనూర్

సంక్షేమ పథకాల కోసం గెలిపించాలి



కోయిల్‌కొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



ఆశన్‌పల్లిలో రోడ్‌షోకు హాజరైన జనం

కోయిల్‌కొండ: నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని శేరివెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన మండల కుర్వయాదవ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కుర్వయాదవులకు గతంలో ఏ ప్రభుత్వం సాయం చేయలేదని, రాష్ట్రం ఏర్పాటుతో సీఎం కేసీఆర్ నిరుపేద లబ్ధిదారులకు రెండు విడతలుగా గొర్రెలను పంపిణీ చేసి ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రూ.400 సిలిండర్, ఎకరానికి రూ.16వేలు రైతుబంధు, రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి రూ.5లక్షల ప్రమాద బీమా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, విద్యాసాగర్, మల్లయ్య, భీంరెడ్డి, కృష్ణయ్య, నాగయ్య, మొగులయ్య, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌ను పంచాయతీగా మారుస్తా

దామరగిద్ద: ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్, ఆశన్‌పల్లి, వత్తుగుండ్ల తండా, సాయంత్రం చాకలోన్‌పల్లి, యల్సన్‌పల్లి, గట్‌రెడ్డిపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతు గెలిచిన వెంటనే లక్ష్మీపూర్ గ్రామాన్ని పంచాయతీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముస్తాపేట్ నుంచి చాకలోన్‌పల్లి, యత్నన్‌పల్లి, గట్‌రెడ్డిపల్లి వరకు రోడ్డు వేశామని గుర్తు చేశారు. అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా సాయం అందిందన్నారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, ఈదప్ప, భీమయ్యగౌడ్, అశోక్, వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, శరణప్ప, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతను గెలిపించుకుందాం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, బస్వరాజ్, నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రం, కాన్‌కుర్తి, కంసాన్‌పల్లి, మొగుల్‌మడ్క, విఠలాపూర్, మద్దెల్‌బీడ్, వత్తుగుండ్ల గ్రామాల్లో నాయకులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి పథకాలను ప్రజలకు వివరించారు.

బీఆర్‌ఎస్ మేలును మరువకండి

మరికల్: ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మేలు మరువరాదని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తరపున ఆయన రాకొండ, పూసల్‌పహాడ్, తీలేర్, పల్లెగడ్డ, మాధవరంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం అమలుకు సాధ్యం కాని పథకల పేర్లను చెబుతూ ప్రచారం చే స్తున్నారని గుర్తు చేశారు. మూడోసారి ప్రభుత్వం అధికారంలోకి పెండింగ్‌లో ఉన్న పథకలను ప్రజల శ్రేయస్సు కోసం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేష్, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, సంపత్, హన్మిరెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటాం



కృష్ణాలో మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి

మక్తల్/మాగనూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని మక్తల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ మండలం సత్యవార్, వడ్వట్ గ్రామాల్లో జలంధర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో రాష్ట్రానికి ఒరిగింది ఏమి లేదని, బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి కట్టలు తెంచుకుందని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల కార్యకర్తలు దాదాపు 50 మంది జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ చేరారు.

అండగా ఉంటాం..

జలంధర్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి పద్మజారెడ్డి మక్తల్ పట్టణంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, భాస్కర్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి జలేందర్‌రెడ్డి, కొండయ్య కోరారు. గురువారం మండలంలోని టైరోడ్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొకల్ వెంకటేష్, సోమశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, నల్లె నర్సప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మక్తల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి కోరారు. గురువారం ఆత్మకూర్ మున్సిపాలిటీతోపాటు మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, ఆనంద్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కొండపురం రాము, కుర్ని ఉదయ్, గాడి శేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, లక్ష్మీనారాయణ, ఎల్లన్న, రాజు తదితరులు ఉన్నారు.

సామర్థ్యాన్ని పెంపొందించాలి

ధన్వాడ: ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని క్లస్టర్ ఇన్‌చార్జి రమేష్‌శెట్టి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్, తెలుగు ఉపాధ్యాయులు అలాగే ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువైన పద్ధతిలో పాఠ్యాంశాలు అర్థమయ్యేలా ఎలా వివరించాలో సూచించారు.



ఉపాధ్యాయులుకు వివరిస్తున్న రమేష్‌శెట్టి

అంత్యక్రియలకు వెళ్తూ..

- ఆటో బోల్తా: ఒకరు మృతి

మక్తల్: ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గుడిగండ్ల శివారులో ఊరగట్టు వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మరికల్ మండలం తీలేరుకు చెందిన లంకాల దాసప్ప, చెన్నప్ప, రాములమ్మ, కుర్మయ్య, లింగమ్మతోపాటు మరికొందరు కలిసి మక్తల్‌లో బంధువు మృతిచెందడంతో అంత్యక్రియలకు వెళ్తున్నారు. ఈ గుడిగండ్ల శివారులో ఆటోడ్రైవర్ నడ్డి కుర్మయ్య ఆటో నడుపుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లంకాల దాసప్ప(46)కు తీవ్ర గాయాలు కాగా.. చెన్నప్ప, రాములమ్మకు తలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లంకాల దాసప్ప మృతిచెందాడు. ఈ ఘటనపై దాసప్ప కుమారుడు లంకాల కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్



ప్రారంభానికి నోచుకుని కన్మనూర్ సబ్‌స్టేషన్

మరికల్: మండలంలోని కన్మనూర్ శివారుల్లో పనులు పూర్తిచేసుకున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. నాలుగేళ్ల నుంచి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పనులు పూర్తికావొచ్చిన ప్రారంభించకపోవడంతో కన్మనూర్ పరిధిలో ఉన్న వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందక లోవాల్టేజీతో మోటర్లు కాలిపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి లోవాల్టేజీ సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీ

మద్దూరు:లింగల్‌చేడ్ పెద్దవాగునుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను కొత్తపల్లి తహసీల్దార్ అనిల్‌కుమార్ గురువారం తనిఖీచేశారు. మన ఇసుక-మనవాహనం యాప్ ద్వారా లబ్ధిదారులకు ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్లను పరిశీలించినట్లు తెలిపారు. ఒక వాహనానికి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌కు జరిమానా విధించారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్‌చేసుకోవాలని సూచించారు.



నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తా..



ఊట్కూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో వాకిటి శ్రీహరి

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించాలని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి కోరారు. గురువారం మండలంలోని మాద్వారస్, పంచలింగాల, ఊట్కూర్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, సీతాదయాకర్‌రెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, సిదార్థరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆయన సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. గోపాల్‌రెడ్డి, శ్రీహరి, మధు, గణేష్‌కుమార్, రవికుమార్ ఉన్నారు.

ఊట్కూర్: మండలంలో గురువారం బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎల్కోటి నారాయణరెడ్డి, ఎల్కోటి లక్ష్మీకాంత్‌రెడ్డి, బస్వరాజ్, అబ్దుల్ రహిమాన్, ఖాజీ మైనోద్దిన్, కృష్ణార్జున్‌రెడ్డి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మక్తల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపించాలని కోరుతూ గురువారం పట్టణంలో నాల్గో వార్డులో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, జుబేర్ ఆహ్మద్, ప్రకాష్, శ్యాం పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారెంటీల అమలు పక్కాగా జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసీరాజ్ అన్నారు. గురువారం ఆత్మకూర్ మున్సిపాలిటీ, మండలంలో వాకిటి శ్రీహరికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, విజయలక్ష్మి, గంగాధర్, వెంకటన్న, అజ్మత్, జుబేర్, రామకృష్ణ, ఈర్లదిన్నె శ్రీను ఉన్నారు.

కృష్ణా: కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి తనయుడు సిద్దార్థరెడ్డి ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శివరాంరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో బోధన చేయాలి



పెద్దకడ్మూర్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్పీ

నర్వ: పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం బోధన చేపట్టాలని పెద్దకడ్మూర్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహులు అన్నారు. గురువారం పాఠశాల పరిధిలోని కాంప్లెక్స్ హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల సమావేశంలో చర్చించేలా చర్యలు చేపట్టాలన్నారు. 45 రోజుల ప్రణాళిక అమలు, టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు సులభమైన బోధన పద్ధతుల ద్వారా బోధన చేపట్టాలని ఆర్పీలు సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ నరేందర్, నర్వ కాంప్లెక్స్ సెక్రటరీ మల్లేష్, సీఆర్పీలు నర్సింహులు, రోజా తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎంను ఉపయోగించాలి



కొల్లంపల్లి కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

నారాయణపేట రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు తరగతిగదిలో విద్యాబోధన చేస్తున్న సమయంలో తప్పకుండా ఆ పాఠ్యాంశానికి సంబంధించిన టీఎల్ఎంను ఉపయోగించాలని జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ నాగార్జున్‌రెడ్డి, సీఎంఓ రాజేంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొల్లంపల్లి, కోటకొండలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలపై అభిరుచిని పెంపొందించాలని, యోగా, వ్యాయామాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి టీచర్లు పాటుపడాలన్నారు. హాజరుశాతం పెంచడానికి కృషిచేయాలని, విద్యార్థి అనుపస్థితి లేకుండా పేరెంట్స్‌తో మాట్లాడి రెగ్యులర్‌గా వచ్చేవిధంగా చూడాలన్నారు. టీచర్లు సమయపాలన పాటించాలని, కాంప్లెక్స్ మీటింగ్‌ల ద్వారా మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని తరగతి గదుల్లో అమలు చేయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు సల్మాన్‌రాజ్, రవికుమార్, సీఆర్పీ రవిప్రకాష్, టీచర్లు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో నిలిచిన తాగునీటి సరఫరా



మరమ్మతులు చేస్తున్న అధికారులు

మద్దూరు: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూరు మండలాలకు గురువారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కొయిల్‌సాగర్ నుంచి కుసుమహ్మద్‌పల్లి ఇన్‌టెక్‌వెల్‌కు నీటిని సరఫరా చేసే 600ఎంఎం పైప్‌లైన్ కోయిలకొండ మండలం వద్ద లీకేజీ కావడంతో నీటిసరఫరా నిలిచిపోయిందని మిషన్‌భగీరథ ఏఈ నరేష్ తెలిపారు. వరిపొలాల్లో పైప్‌లైన్ ఉండడంతో హుటాహుటినా పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మన్నాపూర్ సంప్‌వద్ద వాల్ లీకేజీవుతుందని, దాని సరిచేసి రాత్రివరకు అన్నిగ్రామాల ట్యాంక్‌లకు తాగునీటి సరఫరా చేస్తామని తెలిపారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన



తపాలా శాఖ పథకాలను ప్రజలకు వివరిస్తున్న అధికారులు

మరికల్: మండలంలోని పల్లెగడ్డలో గురువారం తపాలాశాఖ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టుమాస్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. 5 ఏళ్లలోపు వయస్సుకల్గిన పిల్లలకు ఉచిత ఆధార్‌నమోదు ప్రక్రియ, ఆధార్‌కార్డు మొబైల్ లింకు, ప్రమాదబీమా పథకం వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకుగాను పోస్టాఫీస్‌లో ఖాతాలు ఉండాలన్నారు. తపాలశాఖ అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, శివయ్య, అంగన్‌వాడీ, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తరుగుతున్న వన సంపద



మాగనూర్‌లో కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

మాగనూర్: అనుమతులు తీసుకోరూ.. నిబంధనలు పట్టించుకోరూ.. కనిపించిన మట్టిని తవ్వేసి పచ్చని చెట్టుని కొట్టేసి బట్టీలకు తరలిస్తున్నారు. వనసంపదను తగ్గిస్తూ కాలుష్యాన్ని పెంచేస్తూ యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇలాంటి కార్యకలాపాలను కట్టడి చేయాల్సిన అధికారులు కదలట్లేదు. నిబంధనలకు విరుద్ధంగా పచ్చని చెట్లను కొట్టి ఇటుక బట్టీలకు, కట్టేలమిషన్లకు తరలిస్తున్న అటవీశాఖ అధికారులు మాత్రం అటుగా చూడటం లేదని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు మండలం నుంచి పదుల సంఖ్యలో కట్టేల లోడ్‌లతో ట్రాక్టర్ వెళ్తున్న అటవీశాఖ అధికారులు మాత్రం వాటిపై ఏటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బట్టీలపై చర్యలు తీసుకుని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.